

61
ధారావాహిక

# జాయ సేనాపతి

మత్తి భానుమూర్తి
99893 71284

## చారిత్రక కాల్పనిక నవల

**జరిగిన కథ :** రాచనగరిలో జరిగిన వోణీల కార్యక్రమానికి గణపతిదేవుడు - నీలాంబతో కలిసి హాజరయ్యాడు జాయపుడు. ఇంద్రాణి కూడా తల్లిదండ్రులతో కలిసివచ్చింది. వేడుక సందర్భంగా కొందరు రాచనగరి మహిళలు తమ గాత్ర ప్రతిభను ప్రదర్శించారు. అందులో భాగంగా ఇంద్రాణి కూడా ఓ పాట ఎత్తుకున్నది. అప్రతిభుడయ్యాడు జాయపుడు. కార్యక్రమం చివర్లో గణపతిదేవుడు అన్నాడు.. 'మంచి శాస్త్రీయగీతం నువ్వు ఆలపిస్తే.. అందుకు అనుగుణంగా జాయపుడు నర్తిస్తాడు!' అని.

ఒకే ప్రదర్శనాంశాన్ని రెండు కళారూపాలలో నిష్ణాతులు తమ ప్రదర్శనా రీతుల ద్వారా వెలార్చుతూ.. అందులో పోటీపడటం! నిజంగా పూర్తిగా కొత్త!!

జాయపుడు కూడా ఏమాత్రం ఊహించలేదు గణపతిదేవుడు అలా ప్రస్తావిస్తాడని.. విభ్రమతో చూస్తూ ఉండిపోయాడు. అందరి ముఖాలలో ఓ ఉత్సాహం.. ఉత్సుకత.. సరదా ధోరణి.. ఇంద్రాణిలో కూడా!

ఆమె ముందుకు వచ్చింది. అంతవరకూ కూర్చున్న పర్యంకంపై నుంచి లేచి.. వోణి కొంగు నడుముకు దోపింది.. యుద్ధానికి సిద్ధం అన్నట్లు!

''ఏమి జాయా.. ఆమె యుద్ధానికి సిద్ధం అవుతున్నది. నువ్వింకా ఆయుధం ధరించలేదేమీ..?!'' అన్నాడు చక్రవర్తి.. రెచ్చగొడుతున్నట్లు.

నిజానికి జాయపుడు నాట్యానికి మానసికంగా సిద్ధంగా లేడు. కానీ, అతనికి గణపతిదేవుని మాట వేదవాక్కు. యుద్ధంలో నాట్యం చేయమన్నా చేస్తాడు. కానీ, ఈ తరహా రెండు కళారూపాల మధ్య పోటీనా.. పోలికనా?? చూద్దాం.. కదిలి పంచె కాస్త ఎత్తి నడుమువద్ద దోపాడు. కాలి మడమల వద్దనున్న బంగారు కడియాలను కదిపి సరిచేసుకున్నాడు.

నృత్తానికి సిద్ధమైన నాట్యకారుడు నిలబడే తీరును స్థానకం అంటారు. పాద విన్యాసాన్ని చారీ అని, హస్త విన్యాసాన్ని రేచకమని, గాలిలో ఎగరడాన్ని ప్లవనమని, భంగిమలు పట్టడాన్ని కరణమని నాట్యభాషలో పేర్కొంటారు. జాయపుడు స్థానకంగా భంగిమ తీసుకున్నాడు. పాద, హస్తాల విన్యాసాలకు కరణులను మననం చేసుకుంటున్నాడు.

నాట్యవిధానంలో దేవతలకు నమస్కరించి, గురువులకు నమస్కరించే స్థానకంలో.. వంగి గణపతిదేవునికి, నారాంబకు పాదాలను తాకి నమస్కరించాడు.

జాయపుని శరీర సౌకుమార్యం ఎలాంటిదంటే భంగిమపెట్టి చేతులతో రేచకాన్నిపట్టి కరణులను తీసుకుంటే చాలు.. ఎదురుగా ఉన్నవారెవరైనా రెప్పలార్పకుండా చూడాల్సిందే!

ఇంద్రాణిని చూశాడు. నవ్వు మోముతో ప్రారంభించమన్నట్లు కంటితో కాకుండా శరీరంతో చెప్పాడు. ఆమె గొంతు సవరించుకుని చేతులతో తాళం సరిచూసుకుంటూ కళ్లు మూస్తూ తెరుస్తూ స్మరణ చేసుకుంటున్నది.

మందిరంలోని జనులందరూ ఏదో పండుగ చూస్తున్నట్లు చూస్తున్నారు.

నిజానికి వారివారి రంగాలలో ప్రవీణులైన ఇద్దరు కళాకారులు తలపడుతున్నారా.. లేక తమ కళను సమ్మిళితంగా ప్రేక్షకులకు కనువిందు చేయబోతున్నారా!? అనే ఉత్సుకత కలిగించే ప్రదర్శనా విన్నాణం.

ఆమె పాడటానికి సిద్ధమైంది. అతను నర్తించడానికి సిద్ధమయ్యాడు.

ఇంద్రాణి కళ్లు మూసుకుని ఓ క్షణం యోచించింది. 'ఏ పాట?.. ఏ రాగం?.. ఏ తాళం?.. ఏ శ్రుతి?'..